ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 14 మే 2024





పెద్దపల్లి పట్టణంలోని ఆదర్శ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

పోలింగ్ ప్రశాంతం

- అనుకూలించిన వాతావరణం
- దాదాపు 67.80 శాతం పోలింగ్ నమోదు
- ఆయా కేంద్రాల్లో రాత్రి 7 వరకు పోలింగ్
- మందకొడిగా జరిగిన పోలింగ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. వాతావరణం కూడా అనుకూలించడంతో ఓటర్లు కూడా ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాల వరకు రాగలిగారు. ఆదివారం రాత్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడు కున్న వర్షం పడింది. తెల్లారేసరికి వాతావరణం చల్లబడింది. వర్షం కురుస్తుందని, గాలి దుమారం ఉంటుందని భావించారు. కానీ గాలి దుమారం లేదు, వర్షం పడలేదు. ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. అధికారులు అందించిన సమాచారం ప్రకారం మొత్తం పోలింగ్ 67.80 శాతం నమోదయ్యింది. నియోజకవర్గంలో 15,96,430 మంది ఓటర్లు ఉండగా, 10,82,379 మంది ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 71.34 శాతం, రామగుండంలో 61.59 శాతం, మంథనిలో 69.90 శాతం, మంచిర్యాలలో 59.78 శాతం, ధర్మపురిలో 73.74 శాతం, చెన్నూర్‌లో 68.13 శాతం, బెల్లంపల్లిలో 70.53 శాతం పోలింగ్ నమోదయ్యింది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గింది. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 65.68 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి 2.12 శాతం పోలింగ్ పెరిగింది. కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతీయువకులు ఉత్సాహంగా వచ్చి ఓటువేశారు. వృద్ధులకు సంబంధించి అందరు రాకపోయినా, కాస్త అటుఇటు నడవగల శక్తి ఉన్నవాళ్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఉదయం నుంచి పోలింగ్ కాస్త మందకొడిగా సాగింది. ఉదయం 9 గంటల వరకు 9.69 శాతం, 11 గంటల వరకు 26.33 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు 45.12 శాతం, 3 గంటల వరకు 55.92 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 64.23 శాతం పోలింగ్ నమోదయ్యింది.

మంథని, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు సమస్యాత్మక నియోజకవర్గాలు కావడంతో అక్కడ 4 గంటల వరకే పోలింగ్‌కు అనుమతి ఇచ్చారు. ఆ సమయంలోపు కేంద్రాల్లోకి వచ్చిన వారిని లైన్‌లో నిల్చోబెట్టి ఓట్లు వేసే పోలింగ్ సాగింది. పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాల్లో సాధారణ పోలింగ్ సమయం 5 గంటల వరకు ఉండగా, ఎండల దృష్ట్యా కేంద్ర ఎన్నికల సంఘం 6 గంటల వరకు పొడిగించింది. ఆయా కేంద్రాల్లో రాత్రి 7 గంటల వరకు కూడా పోలింగ్ జరగడం గమనార్హం. ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా నియోజకవర్గ ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సాధారణ ఎన్నికల పరిశీలకులు, అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, రామగుండం సీపీ శ్రీనివాస్ పలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లిలోని రంగంపల్లిలోగల పోలింగ్ కేంద్రంలో లైన్‌లో నిలబడి ఓటువేశారు. వీల్‌ఛైర్‌లో వచ్చిన వృద్ధులు ఓటు వేసేందుకు సహాయం అందించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఎలిగేడు మండలం శివపల్లిలో, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఓటువేశారు. పోలింగ్ కేంద్రాల అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించే నాయకులు, కార్యకర్తల మెడలో పార్టీ కండువాలు వేసుకోరాదని, పార్టీ జెండాలు తీసుకరావద్దని ఈసీ నిబంధన విధించింది. కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే అందరినీ ఉంచారు. ఆయా పార్టీల కార్యకర్తలు ఓటర్లను తమ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్స్, కంట్రోల్ యూనిట్లను సిబ్బంది తీసుకవచ్చి డిస్ట్రిబ్యూటరీ కేంద్రాల్లో అందజేశారు. అక్కడినుంచి కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు తరలించారు. ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. వచ్చే నెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ చేపట్టనున్నారు.







సిరా గుర్తును చూపిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ





అదనపు కలెక్టర్‌కు గులాబీ పూలు ఇస్తున్న ఓటర్లు, కాట్నపల్లిలో ఓటు వేసేందుకు వస్తున్న శతాధిక వృద్ధురాలు



రాఘవపూర్‌లో క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు



మంథనిలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే విజయరమణారావు



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు

ప్రశాంత వాతావరణంలో పోలింగ్

- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్

పెద్దపల్లిటౌన్, మే 13: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగినట్లు రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఓటింగ్ సరళి, ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం సీపీ శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజలు పోలీస్ శాఖ సూచనలు పాటిస్తూ తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలోసెల్ ఫోన్ సిగ్నల్ లేని ప్రాంతాలలో శాటిలైట్ ఫోన్‌లను ఉపయోగిస్తున్నట్లు, ప్రాణహిత పరివాహక ప్రాంతంలో, ఫెర్రి పాయింట్స్ వద్ద, పోలింగ్ బూత్ ప్రాంతాలలో డ్రోన్ కెమెరాతో నిరంతర పర్యవేక్షణ, నిఘా కొనసాగుతుందన్నారు. స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ పార్టీలతో ఏరియా డామినేషన్, కూబింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు గోదావరిఖని ఏసీపీ రమేష్, ఏసీపీ మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, గోదావరిఖని త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనారెడ్డి, మంథని సీఐ వెంకటేశ్వర్లు, పెద్దపల్లి సీఐ కృష్ణ, టౌన్ సీఐ రవీందర్, టౌన్ ఇన్‌స్పెక్టర్ రూరల్ సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

మంథని, మే 13: పార్లమెంట్ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుతో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మంథని పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పోలింగ్ ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతుందని, అవాంఛనీయమైన సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక బలగాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మకమైన ప్రాంతాలలో భద్రతను రెట్టింపు చేశామన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూడాలని సూచించారు. ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య నిర్మాణంలో పాలుపంచుకోవాలని ఆయన కోరారు. తమ వంతు బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకునే ప్రక్రియలో అధికారులకు సహకరించాలని సూచించారు. ఆయన వెంట మంథని సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకటకృష్ణ, రాణి వర్మలు పాల్గొన్నారు.



పెద్దపల్లిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న సీపీ

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీపీ

కోల్‌సిటీ, మే 13: రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సోమవారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. రామగుండం నియోజకవర్గ పరిధిలోని గోదావరిఖనిలోని సింగరేణి ట్రైనింగ్ సెంటర్ మోడల్ పోలింగ్ స్టేషన్‌లో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. సీపీ వెంట ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ రమేష్ ఉన్నారు.

ఆసక్తి కనబర్చని అర్బన్ ఓటర్లు

- రామగుండంలో తగ్గిన పోలింగ్
- శాసన సభ ఎన్నికల కంటే

16,438 ఓట్లు తక్కువ..

కోల్‌సిటీ, మే 13: రామగుండం నియోజకవర్గంలో గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే పార్లమెంట్ ఎన్నికలకు ఓటింగ్‌శాతం తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 68.71శాతం ఓటింగ్ నమోదు అయితే పార్లమెంట్ ఎన్నికలకు రామగుండం సెగ్మెంట్‌లో 61.5శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. 7.12శాతం పోలింగ్ తగ్గింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 2,21,019 ఉండగా 1,51,865ఓట్లు పోలయ్యాయి. పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికి మొత్తం ఓట్ల సంఖ్య 2,19,723గా ఉంది. అసెంబ్లీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికల వరకు మొత్తం ఓటర్ల సంఖ్యలో 1692ఓట్లు తగ్గాయి. సోమవారం జరిగిన ఎన్నికల్లో 61.59శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. 1,35,327మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకంటే 16438ఓట్లు తక్కువగా పోలయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపారసంస్థలకు సెలవులు ప్రకటించారు. అయినా ప్రజల్లో ఓటు హక్కును వినియోగించుకోవడంపై కొంత ఆసక్తి తగ్గినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కార్మికవర్గాలకు చెందిన ఓట్లే తక్కువగా పోలైనట్లు భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే అర్బన్ ఓటర్లే పోలింగ్ పట్ల కొంత అనాసక్తి కనబర్చినట్లు భావిస్తున్నారు.



కరీంనగర్ ఓటర్లకు ధన్యవాదాలు

● మంత్రి పొన్నం ప్రభాకర్


పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, మే 13: కరీంనగర్ ఓటర్ల ఆశీర్వచనంతో కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలవబోతున్నారని, ఓటర్లకు దన్యవా దాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 200 యూనిట్లు పొందిన ఉచిత ఓటర్లుకు, ఆర్టీసీలో ప్ర యాణం చేసిన మహిళా ఓటర్లుకు, రూ.500కు గ్యాస్‌సిలిండర్లు లబ్ధి పొందిన ఓటర్లుకు, భవిష్యత్తులో ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఆకాంక్షించిన ఓటర్లుకు, 4 వేల రూపాయలు పెన్షన్ వసాయని ఆకాంక్షించిన ఓటర్లుకు, రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ ఆకాంక్షించిన ఓటర్లుకు, రిజర్వేషన్లు ఎత్తివేస్తారని కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓటర్లకు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. వైశ మ్యాలు దూరంగా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ సరైనదని భావిం చి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన బడుగు, బలహీన వర్గాలకు ప్రత్యేక ధన్యవాదాలని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. హుస్నాబాద్, హుజూరాబాద్, మానకొండూర్, కరీంనగర్, చొప్ప దండి, వేములవాడ, సిరిసిల్ల ఓటర్లకు ధన్యవాదాలన్నారు.

గిరిజన గ్రామాల్లో వెల్లివిరిసిన చైతన్యం


చిన్నకొల్వాయి గ్రామం

- ఆదర్శంగా నిలిచిన చిన్నకొల్వాయి
- మధ్యాహ్నంలోగానే వందశాతం పోలింగ్ నమోదు
- సిబ్బందికి ఫోన్‌లో కలెక్టర్ అభినందన

బీర్‌పూర్, మే 13: జగిత్యాల జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామంలో చైతన్యం వెల్లివిరిసింది. అంతగా అక్షరాస్యత కూడా లేని గిరిజనులు తమ ఓటు హక్కు వినియోగించుకుని మధ్యాహ్నం 12 గంటలకే పోలింగ్ 100 శాతం నమోదు చేశారు. బీర్‌పూర్ మండలం న్నకొల్వాయి గ్రామంలో 165 మంది జనాభాకు గాను 94 మంది మహిళలు, 71 మంది పురుషులు ఉన్నారు. వీరిలో పురుషుల ఓటర్లు 45 కాగా మహిళలు 65 వీరంతా వ్యవసాయం చేస్తూ జీవిస్తారు. సోమ వారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఉదయం 7గంటల నుండి పోలింగ్ కేంద్రానికి చేరుకుని తమ ఓటు హక్కు వినియోగించుకుని సమాజానికి ఆదర్శంగా నిలిచారు. మారుమూల గిరిజన గ్రామంలో మధ్యాహ్నంవరకే పోలింగ్ 100శాతం నమోదు కావడం పట్ల జిల్లా కలెక్టర్ ఫోన్ ద్వారా ఎన్నికల సిబ్బందిని ప్రశంసించినట్లు సమా చారం. అదేవిధంగా ఎన్నికల సెక్టర్ అధికారి చెక్కు నాయక్, రూట్ ఆఫీసర్ రాజు కుమార్, కార్యదర్శులు ముద్దం విజయ, నారాయణ, అంగన్‌వాడీ టీచర్ బేరా యశోద, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

- ఓటు కోసం 1,300 కిలోమీటర్ల ప్రయాణం

చిన్నకొల్వాయి గ్రామానికి చెందిన కోట్నాక శ్రీను హరిప్రయలు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సిరికోల్ జిల్లాలో ఓ మైనింగ్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయడం కోసం భార్య హరిప్రియ తో కలిసి 1,300 కిలోమీటర్లు ప్రయాణించి వచ్చి ఓటు వేశాడు. ఇంతగా ఇబ్బందితో ఎందుకు వచ్చారని అడుగగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయ లేక పోయామని అందుకు చాలా బాధగా అనిపించి వచ్చామని వివరిం చారు. అలాగే గ్రామానికి చెందిన కోట్నాక తిరుపతి, చిత్రం బుచ్చి రాములు కూడా హైదారాబాద్ నుంచి ఓటు వేయడానికి రావడం విశేషం.


మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన దంపతులు


మొదటిసారి ఓటు వేసిన యువతులు

రోడ్డుపై విరిగిపడిన చెట్టు కొమ్మ

- తొలగించిన పోలీసులు

ఎండపల్లి, మే 13: ఇటీవలే కురిసిన చిరుజల్లు వర్షానికి, ఈదురు గాలులకు మండం లోని శానబండ గ్రామంలో నడిరోడ్డుపై చెట్టు కొమ్మ విరిగి పడింది. ఎన్నికల విధులలో భాగంగా శానబండ వెళతున్న పోలీసులు తమ వాహనాన్ని ఆపి స్వయంగా పోలీసులు కొమ్మను పక్కకు తీసేసి గ్రామంలోకి వెళ్లారు. పోలీస్ సేవే కాకుండా సమాజ సేవ చేయడం పట్ల అటు నుండి వెళతున్న ప్రయాణికులు ఫోటో తీసి గ్రామాలలోని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. వీరిని గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వేణు, కిరణ్, తిరుపతి పాల్గొన్నారు.


చెట్టు కొమ్మను తొలగిస్తున్న పోలీసులు

బీజేపీ కార్యకర్తపై దాడి

కథలాపూర్, మే 13: మండలంలోని చింతకుంటలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసు కుంది. ఎస్సై నవీన్ కథన ప్రకారం...పోలింగ్ జరుగు తున్న సమయంలో గ్రామం నుంచి వాహనంలో బీఆర్ఎస్ నాయకులు ఓటర్లను తరలిస్తుండగా బీజేపీ కార్యకర్త నేతుల మల్లేశం అభ్యంతరం తెలిపాడు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లేశంను కొట్టడంతో పాటు టాటా ఏస్ వాహనం ఎక్కించారు. దీంతో మల్లేశం కాలు విరిగింది. వెంటనే చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి కరీంనగర్ పంపించామన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించడంతో పాటు దాడి చేసి న ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి కుటుంబాన్ని బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు సాయంత్రం పరామ ర్శించారు.

యువకుడిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, మే 13: మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన జయరాజ్ అనే యువకుడు ఓటు వేస్తు సెల్ఫీ దిగాడు. గ్రామంలోని 8వ నెంబర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వెళ్లి సెల్ఫీ దిగినట్లు అధికా రులు గుర్తించారు. వెబ్ కెమెరాలను గుర్తించి పోలింగ్ సిబ్బంది ఉన్నతాధికారులకు చెప్పారు. యువకుడి నుంచి సెల్‌ఫోన్‌ను అధికారు స్వాధినం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీస్‌లు కేసు నమోదు చేశారు.

యువకులు, మహిళలపై ఇన్‌చార్జి ఎస్సై లాఠీచార్జి


స్థానికులపై లాఠీచార్జి చేస్తున్న ఎస్‌ఐ రమేశ్

ఎల్లారెడ్డిపేట, మే 13: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో విధులు నిర్వ హిస్తున్న ఇన్‌చార్జి ఎస్సై అల్లం రమేశ్ ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్‌లో సోమవారం అత్యుత్సాహం ప్రదర్శించారు. నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి బయట నిలబడిన యువకులు, మహిళలపై ప్రతాపం చూపారు. దుకాణాలు మూసి వేయా లంటూ హంగామా సృష్టించారు. ఎస్సీ కాలనీలోకి దూసుకెళ్లి యువకులు రొడ్డ మహేశ్, వేములవాడ పూర్ణచందర్‌తోపాటు మహిళలను లాఠీతో కొట్టారు. మహేశ్ కాలుపై వాతలు తేలాయి. కేంద్రానికి దూరంగా ఉన్న వంగ మల్లారెడ్డి ఇంటి వద్దకెళ్లి ఇక్కడేం చేస్తున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లు తనదేనని చెప్పిన వినకుండా ఆధార్ కార్డు తీసుకురమ్మ న్నారు. ఆధార్ కార్డును చూపితే లాక్కొని అసభ్యపదజాలంతో దూషిం చారు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. ఎస్సై రమేశ్ తీరుపై స్థానికులు, మహిళలు తిరగబడ్డారు. అకారణంగా చితకబాదా రంటూ నిలదీశారు. ఎస్సైకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు అక్కడకు చేరుకు న్నారు. పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్న ఎందుకు కొడుతారని పోలీ సులను నిలదీశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ అక్కడికి చేరుకొని ఎస్సై రమేశ్‌ను అక్కడినుంచి పంపించారు. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు వెళ్లిపోయారు. ఎస్సై తీరుపై బాధితుడు మహేశ్ ఎస్పీ అఖిల్‌మహాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, స్థానిక నాయకులు తెలిపారు.


ఎస్‌ఐతో వాగ్వాదానికి దిగిన నాయకులు, స్థానికులు


బోనాలతో తరలివెళ్తున్న భక్తులు

గోరంటాలలో ఎల్లమ్మ సిద్ధోగం ఉత్సవాలు

గంభీరావుపేట, మే 13: గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ సిద్ధోగం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమ య్యాయి. సోమవారం నుంచి మంగళవారం వరకు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. సోమవారం పుట్టకు ధని పోయడంలో భాగంగా బోనాలను ఊరేగింపుగా తీసు కెళ్లారు. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవా రం రాత్రి ఎల్లమ్మకు బోనాలను సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మొలకెత్తిన ధాన్యం .. అన్నదాతల ఆందోళన

ఎల్లారెడ్డిపేట, మే 13: కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం వర్షాలకు మొలకెత్తడంతో అన్నదాతలు అందోళన చెందుతున్నారు. కొనుగో ళ్లలో నెలకొంటున్న జాప్యంతో కేంద్రాల వద్ద రోజుల తరబడి ఎదురుచూ స్తున్న కర్షకులకు వర్షం మరో సమస్యగా మారింది. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి గత నెల 22న రైతు సంకూరి శంకర్ ధాన్యం తీసుకొచ్చారు. 17 శాతం తేమ నిబంధన ఉండటంతో వడ్లు ఆరబెట్టారు. ఈ క్రమంలో ఇటీవల కురిసిన వర్షంతో ధా న్యం తడిసిపోయి మొలకెత్తింది. మొలకెత్తిన ధాన్యాన్ని వేరు చేసి ఆరబెట్టేం దుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని రైతు శంకర్ వాపోయాడు. సుమారు 20 మంది రైతులకు సంబంధించిన ధాన్యం తడిసి పోయి మొలకలు వచ్చా యని తెలిపాడు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతున్నారు.


రాజన్నపేటలో మొలకెత్తిన ధాన్యం


సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


కేశవపట్నంలోని మహిళా మోడల్ కేంద్రంలో...


వీణవంక పోలింగ్ కేంద్రంలో మహిళల క్యూ


కరీంనగర్‌లోని ముఖరంపుర ఉర్దూ మీడియం పాఠశాలలో

వెల్లువెత్తిన

ఓటరు చైతన్యం

పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు ఉత్సాహంగా తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. యువత ఓటు వేయడానికి ఆసక్తి చూపించారు. మొదటి రెండు గంటల్లో మందకొడిగా ఓటింగ్ జరుగగా, 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ తర్వాత ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో చాలా చోట్ల ఓటర్లు లేక పోలింగ్ కేంద్రాలు వెలవెలబోయాయి. తిరిగి సాయంత్రం 4 గంటలనుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.



పెగడపల్లి మండలం ఆరవెల్లిలో మొదటిసారి ఓటు వేసిన యువత


సిరిసిల్లలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు


రాయికల్‌లో మొదటి సారి ఓటు వేసిన యువతులు


ఇల్లందకుంట మండలం మల్లివానిపల్లెలో వృద్ధురాలు..


కాల్వశ్రీరాంపూర్‌లో వికలాంగుడిని వీల్‌చైర్‌లో తీసుకువస్తున్న తహసీల్దార్ జాహెద్‌పాషా


మల్యాలలో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకువస్తున్న సిబ్బంది


గోదావరిఖనిలో ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్లు


కరీంనగర్‌లో తొలిసారి ఓటు వేసిన యువతులు



కరీంనగర్‌లో బారులు తీరిన ఓటర్లు



తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో మహిళా పోలింగ్ కేంద్రం


మెట్‌పల్లి మండలంలోని ఏఎస్ఆర్‌తండాలోని ట్రైబల్ మోడల్ కేంద్రం

కాంగ్రెస్ అభ్యర్థిపై ఫిర్యాదు

కరీంనగర్ క్రైం/భగత్‌నగర్,మే 13: కరీంనగర్ నియోజక వర్గం కాంగ్రెస్ అభ్యర్థిపై బీజేపీ నాయకుడు, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఈవి ఎంలో నాల్గవ నెంబర్ కేటాయించడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు 4వ నెంబర్ గల టీషర్టులు ధరించి పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిర్వహించారన్నారు. ఎన్నికల నియామవళిని ఉల్లంఘించిన కాంగ్రెస్ అభ్యర్థిపై చర్యలు చేపట్టాలని బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుపై ఎన్నికల నియామవళి ఉల్లంఘనపై ఎన్నికల కేసు నమోదు చేశారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఎల్లారెడ్డిపేట, మే 13: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి శివారులోని కొత్తకుంట చెరువులో చేపల వేటకు వెళ్లి ఈ నెల 12న గల్లంతైన ఆలకుంట రాజు (35) మృతదేహం సోమవారం లభించినట్లు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. గొల్లపల్లికి చెందిన రాజు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి గ్రామ శివారులోని కొత్తకుంట చెరువులో చేపలకు వేటాకు వెళ్లి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు, స్థానికులు అదే రోజు రాత్రి గాలింపు చేపట్టారు. చీకటి ఉండడం.. వర్షం పడుతుండడంతో గాలింపునకు ఆటంకం ఏర్పడింది. సోమవారం ఉదయం కొత్తకుంట చెరువులో రాజు శవమై తేలాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్, మే 13: మండలంలోని రాంపూర్ గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రం పశ్చిమ చంపార జిల్లాకు చెందిన సంజీవ్ మిశ్రా(49) అనే వ్యక్తి సీడ్ కంపెనీలో ప్రొడక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 6 గంటలకు వృత్తిలో భాగంగా జమ్మికుంట మండలం నగురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తితో కలిసి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో రాంపూర్ గ్రామంలోని హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రహదా రిపై ద్విచక్ర వాహనంపై అదుపు తప్పి డివైడర్‌ను కొట్టి కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే ఆయనను హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

అమ్మవారి ఆశీస్సులు తీసుకుని.. అమ్మతో కలిసి

● ఓటు హక్కు వినియోగించుకున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 13: మహాశక్తి అమ్మవారి ఆశీస్సులు... అమ్మతో కలిసి నగరంలోని జ్యోతినగర్‌లోని 174 పోలింగ్ కేంద్రంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కుమార్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం నగరంలోని మహాశక్తి దేశాలయంలో సతీసమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి ఆశీస్సులు తీసుకుని తల్లితో కలసి, కుటుంబ సభ్యులతో పాటు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

● పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన బండి

కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని పలు పోలింగ్ బూత్‌ల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. నగరంలోని కిసాన్‌నగర్ కేంద్రం వద్ద ఓటర్లకు అభివాదం చేశారు. మానకొండూర్, వీణవంక, జమ్మికుంట, హుజూరాబాద్, సైదాపూర్, హుస్నాబాద్, చిగురుమామిడి, సిరిసిల్ల, వేములవాడలో ఓటింగ్ సరళిని పరిశీలించారు.


విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న బండి సంజయ్ దంపతులు

అనుమానాస్పద స్థితిలో గొర్రెలు మృతి

రాయికల్, మే 13: మండలంలోని అయోధ్య గ్రామంలో యాదవ కులస్థులకు చెందిన 20 గొర్రెలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాయి. గ్రామానికి చెందిన ఒర్రె గంగమల్లయ్య, ఒర్రె రమేష్, ఒర్రె గంగరాజం దినసరి వృత్తిలో భాగంగా గొర్రెలు, మేకలను మేపుతుంటారు. ఈ క్రమంలో గొర్రెలు కొన్ని గంటల వ్యవధిలోనే అనుమానాస్పదంగా కిందపడి కొట్టుకుని మృతి చెందినట్లు గొర్రెల యాజమానులు తెలిపారు. పశువైద్యాధికారి శ్రీనివాస్‌కు సమాచారం అందించగా మృతిచెందిన గొర్రెలకు పంచనామా నిర్వహించి క్రిమిసంహారక మందులు తిని మరణించినట్లు తెలిపారు. ఈ క్రిమి సంహారక మందులు వన్యప్రాణులను వేటాడేందుకు పెట్టినవిగా స్థానికులు భావిస్తున్నారు. కాగా గ్రామానికి చెందిన ఒర్రె గంగ మల్లయ్యకు చెందిన 12 గొర్రెలు, మేకలు, ఒర్రె రమేష్‌కు చెందిన నాలుగు గొర్రెలు, ఒర్రె గంగరాజంనకు చెందిన నాలుగు గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.3 లక్షలకు పైగా ఆర్థికంగా నష్టపోయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ ఎడమల జీవన్‌రెడ్డి, యాదవ సంఘం మండల అధ్యక్షుడు వాసరి రవి యాదవ్ కోరారు.

ఓటు వేసే వీడియో సోషల్ మీడియాలో వైరల్

● ఇద్దరిపై కేసు నమోదు

జగిత్యాల టౌన్, మే 13: ఎంపీ ఎన్నికల పోలింగ్ సమయంలో ఓటు వేసి వీడియో తీసి ఈవీఎంతో పాటు బ్యాలెట్ పేపర్ కనబడే విధంగా సోషల్ మీడియాలో వైరల్ చేసిన ఇద్దరిపై జగిత్యాల టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఖిలాగడ్డకు చెందిన నదీమ్, సమీర్ అనే వ్యక్తులు ఈ చర్యకు పాల్పడ్డట్లు ఎఫ్ఎస్‌టీ టీం ఇన్‌చార్జి కుమారస్వామి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

అంజన్న నిత్యాన్నదానంకు రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

మల్యాల, మే 13: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానంకు స్వామి వారి భక్తులు సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన డి.కృష్ణ వారి కుమారుడు అంజన్ ఈ విరాళంను అన్నదాన విభాగం ఇన్‌చార్జీ రాజేందర్ రెడ్డికి అందించారు. భక్తులు కొండగట్టులో నిర్వహిస్తున్న నిత్యన్నదాన పథకంకు విరివిగా విరాళాలు అందించాలని ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు కోరారు.

చెట్టును ఢీకొట్టిన కారు : ముగ్గురికి గాయాలు

జమ్మికుంట రూరల్, మే 13: జమ్మికుంట మండలం తనుగుల గ్రామ మూల మలుపు వద్ద ఓ కారు చెట్టును ఢీకొన్న సంఘటనలో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. కాల్వశ్రీరాంపూర్ మండలం బేగంపేటకు చెందిన శ్రీనివాస్, రమ దంపతులు తమ కుమార్తెతో కలిసి ఓటు వేసేందుకు కారులో వరంగల్ నుంచి స్వగ్రామానికి వెళుతున్నారు. మార్గ మధ్యలో తనుగుల గ్రామ పరిధిలో మూల మలుపు వద్ద ప్రమాదవశాత్తు కారు చెట్టును ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. అటువైపుగా వస్తున్న హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కార్యకర్తల సహాయంతో గాయపడ్డ వారిని 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఒకరి ఆత్మహత్య

పాలకుర్తి, మే 13: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈసాల తక్కళ్ళపల్లిలో సోమవారం ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బానోతు తిరుపతి(35) భార్య పుట్టింటికి వెళ్లి కొన్ని రోజుల నుంచి తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి కూతురు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, మే 13: పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన నర్ర రాము(25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలిసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని నెలల క్రితం రాము తండ్రి మృతిచెందగా అప్పటినుంచి మానసిక వేదనకు గురవుతున్నాడు. ఈ నెల 3న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా సోమవారం మృతిచెందాడు. మృతుడి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

ఓటర్లకు డబ్బులు పంచిన ఇద్దరిపై కేసు

వీణవంక, మే13: మండలంలోని చల్లూరు, ఎలబాక గ్రామాల్లో ఓటర్లుకు డబ్బులు పంచుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. చల్లూరు గ్రామంలో పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు డబ్బులు పంచుతున్న బీజేపీ నాయకుడు రామిడి అదిరెడ్డిని ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ వడ్లకొండ ఐలయ్య పట్టుకొని 11వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఐలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎలబాక గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు ఊట్ల దేవయ్య ఓటర్లకు డబ్బులు పంచుతుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్ రామ్‌కుమార్ పట్టుకొని 14 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. రామ్‌కుమార్ ఫిర్యాదు మేరకు దేవయ్యపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం పైనుంచి పడి ఒకరి మృతి

ముస్తాబాద్, మే 13 : మండలంలోని తుర్కపల్లె గ్రామానికి చెందిన అంకని భూమయ్య(56) అనే వ్యక్తి ద్విచక్రవాహనం పైనుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. తుర్కపల్లెకు చెందిన అంకని భూమయ్య పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం పైనుంచి కిందపడి చనిపోయాడు. భూమయ్య కొడుకు అంకని సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కౌన్సిలర్ ఇంట్లో మద్యం పట్టివేత

సిరిసిల్ల టౌన్, మే 13: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులోని కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్ ఇంట్లో మద్యం పంచుతుండగా సోమవారం పార్లమెంట్ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్(బీఆర్ఎస్) దాదాపు లక్ష రూపాయులు విలువ చేసి మద్యం ఇంట్లో నిలవ చేసినట్లు తెలిసింది. శనివారం రాత్రి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ఓటు వేయాలంటూ ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ మద్యంను పంచుతున్నట్లు అధికారుల దృష్టికి వెళ్లడంతో సోమవారం దాడులు చేశారు. కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్ ఓటర్లకు మద్యం పంచుతుండగా ఇంట్లోనే పట్టుకున్నారు. అధికారుల దాడిలో రూ. 25వేల విలువ చేసే మద్యం దొరికింది. కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్‌ను విచారణ జరిపి మద్యానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

నృసింహ నవరాత్రోత్సవాలు ప్రారంభం


స్వామివారలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, మే 13: ధర్మపురి క్షేత్రంలో నృసింహ నవరాత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5-30 గంటలకు అర్చకులు మంగళ వాయిద్యాలు వెంట రాగా గోదావరి నదికి బయలుదేరి వెళ్లారు. గోదావరి నదిలో పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి బిందె తీర్థం తీసుకువచ్చారు. ఉదయం 6-30 గంటలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కు మార్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వస్తి పుణ్యాహవచనం, రుత్విక్వరణం, కలశ స్థాపన, స్వామివారలకు పంచోపనిషత్తులచే అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు సహస్ర కలశ స్థాపన, నవగ్రహ, యోగినివాస్తు, క్షేత్ర పాలక స్థాపనలు, అర్చనాది ఆరాధన, హారతి పూజలు నిర్వహించారు.


బిందె తీర్థం తీసుకువస్తున్న అర్చకులు

పోటెత్తిన గ్రామీణ ఓటర్లు

గోదావరిఖని, మే 13: రామగుండం నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదు. పోలింగ్ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు చర్యలను చేపట్టారు. రామగుండం నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు ఉన్న సెక్రడ్ హార్ట్ హైస్కూల్, గుడ్‌మార్నింగ్ హైస్కూల్ పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు రక్షణ చర్యలు చేపట్టారు. సెక్రడ్ హార్ట్ హైస్కూల్ పోలింగ్ లొకేషన్‌లోనే 9వేలకుపైగా ఓటర్లు ఉన్నారు. కాగా పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి మందకొడిగానే సాగింది. ఉదయం 9గంటలకల్లా కేవలం 7.64శాతమే ఓటింగ్ నమోదయ్యింది. కార్మిక క్షేత్రం కావడంతో పరిశ్రమలు సెలవులు ప్రకటించాయి. పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇండ్ల వద్దనే ఉన్నారు. అర్బన్‌కంటే గ్రామీణప్రాంతాల ఓటర్లే పోలింగ్ పట్ల ఆసక్తి కనబరిచారు. రామగుండం నియోజకవర్గంలోని మోడల్ పోలింగ్ స్టేషన్ అయిన గోదావరిఖని సింగరేణి టీసీసీ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ సందర్శించారు. ఈ ఎన్నికల్లో 61.5శాతం పోలింగ్ నమోదు అయ్యింది. కాగా, రామగుండం నియోజకవర్గంలో ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తన సతీమణి హేమలతతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తన సతీమణి మనాలీఠాకూర్‌తో కలిసి రామగుండం పట్టణం అయోధ్యనగర్‌లోని 29బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గుడ్‌మార్నింగ్ హైస్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని 56వ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ విఠల్‌నగర్‌లోని అమరేశ్వర హైస్కూల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : పార్లమెంట్ ఎన్నికలు సోమవారం కాలనీలో ప్రశాంతంగా జరిగాయి. కాలనీలో ఓటింగ్ శాతం 45 శాతం నమోదైంది. మొత్తం 19,829 ఓట్లకు 8,958 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ఎనిమిది పోలింగ్ స్టేషన్‌లలో 25 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రారంభంలో తక్కువగా సంఖ్యలో ఓటర్లు కేంద్రాల్లో కనిపించగా, 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎండ తీవ్రత కారణంగా మధ్యాహ్నం పోలింగ్ కేంద్రాల వద్ద నిర్మానుష్య వాతావరణం కనిపించింది. చివరి గంటలో పోలింగ్ పెరిగింది. పోల్ చిట్టీలు అందక పోవడంతో చాలా మంది పోలింగ్ బూత్‌లు తెలియక తికమక పడ్డారు. తమ ఓటు ఎక్కడ వచ్చిందో తెలియక కొందరు వెనుదిరిగారు.

జ్యోతినగర్ : ఎన్టీపీసీ ఏరియాలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగిది. ఉదయం నుంచే అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్లు ఉత్సాహంగా ఓటు వేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఎండ కారణంగా కొంత పోలింగ్ మందకొడిగా సాగింది. సాయంత్రం 4 గంటల నుంచి తిరిగి పోలింగ్ ఊపందుకుంది. మొదటిసారి ఓటు హక్కు వచ్చిన పలువురు యువతీయువకులు ఉత్సాహంగా ఓటు వేశారు. దివ్యంగులు సైతం తమ ఓటు హక్కును వినియెగించుకోవడం కనిపించింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఆయా రాజకీయ పార్టీలకు చెందిన శ్రేణులు సందడి చేశాయి. పోలింగ్ కేంద్రాల వద్ద స్థానిక పోలీసులతోపాటు కేంద్ర భద్రతా బలగాలు బదోబస్తు నిర్వహించాయి. ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్‌లోని 56వ పోలింగ్ కేంద్రంలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాంచందర్ క్యూ లైన్లో నిలబడి ఓటు వేయడం విశేషం. అలాగే అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ ఇదే పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

అంతర్గాం : మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉదయం నుంచే బారులు తీరారు. మండలంలో 26పోలింగ్ కేంద్రాలు ఉండగా సాయంత్రానికల్లా 72శాతం పోలింగ్ నమోదు అయ్యింది. రామగుండం పట్టణంలోని అయోధ్యనగర్‌లో స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. విలేజీ రామగుం డం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కార వేణుగోపాల్‌రావు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పాలకుర్తి : మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. చెన్నూర్ ఎమ్మె ల్యే గడ్డం వివేక్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మండలంలో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు. పెద్దపల్లి ఏసీపి గజ్జి కృష్ణ, బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


సుల్తానాబాద్‌లో బారులుతీరిన ఓటర్లు

పెద్దపల్లిటౌన్ : పెద్దపల్లి పట్టణంలో పార్లమెంటు ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. పట్టణంలో 36 వార్డులకు 36 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలైంది. జూనియర్‌కాలేజీ, ఐటీఐ మైదానంలో ఈవీఎంలు మొరాయించడంతో మరమ్మతులు చేయడంతో పోలింగ్ కొనసాగింది. ఉదయం నెమ్మదిగా మొదలైన పోలింగ్ పదకొండు గంటలకు ఉపదందుకుంది. సాయంత్రానికి సుమారు 68శాతం పోలింగ్ నమోదయ్యింది. అయితే సుమారు మూడునాలుగు వందల ఓట్ల వరకు గల్లంతు కావడంతో ఓటర్లు అసహనానికి గురై తిరిగి వెళ్లిపోయారు.

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. కాసులపల్లిలోని బూత్ నెంబర్ 5లో ఈవీఎం మొరాయించడంతో గంట వరకు ఓటర్లు వేచిచూడగా అధికారులు సరిచేశారు. పెద్దకల్వలలోని 74,75,76 పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలిస్‌లు భారీ బందోబస్త్ నిర్వహించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

ఓదెల : మండలంలోని 40 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం 71.66 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 35 వేల 274 ఓటర్లకు 25వేల 279మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జీలకుంటలోని 176వ పోలింగ్ బూత్, పొత్కపల్లిలోని 171వ పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించడంతో రెండు గంటల పాటు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. మరమ్మతులు చేపట్టడంతో పోలింగ్ కొనసాగింది. ఓదెల హైస్కూల్ పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే విజయరమణరావు, కొలనూర్ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లను అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సందర్శించారు. ఏసీపీ గజ్జి కృష్ణ గ్రామాన్ని సందర్శించి భద్రతా చర్యలను పరిశీలించారు. పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఎలిగేడు : మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 249 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయంచడంతో గంట పాటు ఓటింగ్‌కు అంతరాయం ఏర్పాడింది. ఓటర్లు సైతం అసహనానికి గురైయ్యారు. సెక్టార్ ఆఫీసర్ ఉమాపతి టెక్నికల్ లోపాన్ని సరిచేయడంతో సమస్య సద్దుమణిగింది. మండలంలోని శివపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు. అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత వేరువేరుగా మండల కేంద్రంలోని 261, 263, 264 పోలింగ్ బూత్‌లను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో భాస్కర్‌రావు, సెక్టాల్ అధికారి ఉమాపతిని పోలింగ్ బూత్ పరిస్థితిపై ఆరా తీశారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్‌లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. గర్రెపల్లిలోని 221 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో కొంత అలస్యంగా పోలింగ్ మొదలైంది. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ స్టార్ట్ అవుతుందనగా చాలా మంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కొన్ని సెంటర్లలో ప్రారంభ సమయంలో ఎవరూ రాలేదు. ఎనిమిద తర్వాత పోలింగ్ కొంత వేగవంతంగా సాగింది. సుల్తానాబాద్‌తోపాటు పలు గ్రామాల్లో పోలింగ్ సరళిని ఎమ్మెల్యే విజయరమణారావు,అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్, ఆర్డీవో, తహసీల్దార్, ఎన్నికల ప్రత్యేకాధికారులు పర్యవేక్షించారు. డీసీపీ చేతన పలు కేంద్రాల వద్ద పోలిస్ బందోబస్తును పర్యవేక్షించారు. కొత్తగా ఓటు హక్కును వినియోగించుకున్న యువతీయువకులకు అదనపు కలెక్టర్, ఆర్డీవోలు పువ్వులు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

సుల్తానాబాద్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 204 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో అది పని చేయకపోవడంతో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు గంటకు పైగా వేచి ఉన్నారు. మొరాయించిన ఈవీఎంను బాగు చేయడం సాధ్యం కాకపోవడంతో అధికారులు కొత్త ఈవీఎంను తెచ్చి పోలింగ్‌ను కొనసాగించారు. ఈవీఎం మొరాయింపు, ఓటర్ల వెయిటింగ్ చేస్తున్న విషయం తెలుసుకున్న సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్ చేరుకున్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ 204 పోలింగ్ కేంద్రానికి వచ్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు.


ముత్తారంలో బారులుతీరిన ఓటర్లు

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీ సాయంత్రం సుల్తానాబాద్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ సరళిని శాతాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన బయటకు వచ్చి విలేకరులతో మాట్లాడుతు తనకు మద్దతుగా ప్రచారం చేసిన నాయకులకు కార్యకర్తలకు, ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్యే విజయరమణారావు, నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, అంతటి అన్నయ్య గౌడ్, సాయిరి మహేందర్, శ్రీగిరిశ్రీనివాస్, రాజలింగం తదితరులు ఉన్నారు.

జూలపల్లి : మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటల నుంచి ప్రారంభమైనా ఎన్నికల పోలింగ్ మొదట కొంత మంద కొడిగా సాగిన 10 గంటల నుండి ఓటర్లు పోలింగ్‌కేంద్రాలకు బారులు తీరి, సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. మండలంలో మొత్తం 21,964 ఓటర్లు ఉండగా అందులో 10,847 పురుషులు, 11,117 మహిళా ఓటర్లు ఉన్నారు. మండలవ్యాప్తంగా సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు 8,175 మంది పురుషులు కాగా 8,021 మహిళా ఓటర్లు పోలింగ్‌లో పాల్గొని తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. మండలంలో మొత్తం 16,196 మంది ఓటర్లు పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోగా 73.74శాతం పోలైనట్లు తహసీల్దార్ బషీరొద్దీన్ తెలిపారు. జూలపల్లి ఎస్ఐ శ్రీధర్ బందోబస్తు నిర్వహించారు.

మంథని : మావోయిస్టు నక్సల్ ప్రభావిత ప్రాంతమైన మంథని నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పెద్దపల్లి-భూపాలపల్లి జిల్లాల్లో విస్తరించి ఉన్న మంథని నియోజకవర్గంలో ఈవీఎంల మిషన్లు మొరాయించడం మినహా పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గంలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, మల్హర్, కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, పల్మెల, పాలకుర్తి మండలాల్లో మొత్తం 2,39,699 మంది ఓటర్లు ఉండగా ఎన్నికల అధికారులు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు మొత్తం 288 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు భారీగా తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నక్సల్స్ ప్రాబల్య ప్రాంతమైన నియోజకవర్గంలో పోలింగ్ సమయం 4 గంటల వరకే ఉండగా, అప్పటికే పోలింగ్ కేంద్రాల గేట్‌లోపల ఉన్న వారిని సమయం దాటినప్పటికీ ఓటు వేసేందుకు అనుమతించారు. దీంతో పలు పోలింగ్ కేంద్రాల్లో దాదాపు 5గంటలకు పైగా పోలింగ్ ప్రక్రియ సాగింది. మంథని పట్టణంలోని బోయినిపేటలో బూత్ నంబర్ 94, మంథని మండలంలోని ఆరెందలో బూత్ నెంబర్ 105, చిన్న ఓదాల గ్రామంలో బూత్ నంబర్ 111, ముత్తారం మండలం మచ్చుపేటలోని బూత్ నంబర్ 281లో, మల్హర్ మండలం తాడిచర్లలో బూత్ నెంబర్ 248, మహదేవపూర్‌లోని బూత్ నంబర్ 175, అన్నారంలోని బూత్ నంబర్ 168లో ఈవీఎం మిషన్లు మొరాయించడంతో ఈ కేంద్రాల్లో కొంత మేర ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మంథనిలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రామగిరి మండలంలో పోలింగ్ సరళి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి, ముత్తారం మండలంలో పోలింగ్ సరళిని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. మంథనిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణలు పరిశీలించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భూపాలపల్లి జిల్లాలో ఉన్న మంథని నియోజకవర్గం కాటారం మండలం ధన్వాడలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంథనిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని రామగుండం సీపీ శ్రీనివాస్ సందర్శించిఅధికారులు, సిబ్బందికి సూచనలు అందించారు. మంథనిలోని పలు పోలింగ్ కేంద్రాలను పెద్దపల్లి డీసీపీ చేతన సైతం పరిశీలించారు. రామగిరి మండలం బేగంపేట, ముత్తారం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఆదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ సందర్శించారు. కాగా, మంథని నియోజకవర్గంలో 69.90శాతం పోలింగ్ నమోదైంది.

ముత్తారం : మండలంలో ఎన్నికలు సజావుగా సాగాయి ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభించారు. మండలంలో మొత్తం 22889 ఓట్లు ఉండగా గ్రామాల వారీగా మొత్తం 15880 ఓట్లు ఓట్లు పోలయ్యాయి మొత్తం 68.17 శాతం ఓట్లు నమోదయ్యాయి. కేషనపల్లి, లక్కారం, అడవి శ్రీరాంపూర్ ఖమ్మంపల్లి గ్రామాల్లో వృద్ధులకు దివ్యాంగులకు కాస్త ఇబ్బందులకు ఎదురయ్యాయి. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సందర్శించారు. ఎంపీడీవో లలిత, తహసీల్దార్ సుమన్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని 24 గ్రామపంచాయతీలలో సోమవారం జరిగిన ఎంపీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గంగారం గ్రామంలో 121 పోలింగ్ కేంద్రంలో కొద్దిసేపు ఈవీఎం యంత్రం మొరాయించింది. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. ఉదయం 7గంటల నుంచి 11 గంటల లోపు ఆయా గ్రామాల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. అధిక ఎండా కారణంగా 12గంటల నుంచి నాలుగు గంటల వరకు ఒక్కొక్కరు మాత్రమే వచ్చి ఓటు వేసి వెళ్ళిపోయారు. నాలుగు గంటల నుంచి 6 గంటలలోపు ఎండ వేడిమి తగ్గాక ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. గ్రామాల్లో వృద్ధులు, వికలాంగుల కోసం గ్రామపంచాయతీ సిబ్బంది ద్వారా వీల్ ఛైర్స్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. తహసీల్దారు జాహెద్ పాషా వృద్ధులను వికలాంగులను ఓటు వేసేందుకు వీల్ ఛైర్‌ల ద్వారా పోలింగ్ కేంద్రాలకు స్వయంగా తరలించారు. అదనపు కలెక్టర్ శ్యాంలాల్‌ప్రసాద్, ఆర్‌డీఓ గంగయ్య, తహసిల్దార్ జాహెద్ పాషా, ఎంపీడీవో రామ్మోహనచారి, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలో 34,232 మంది ఓటర్లు ఉన్నారు. 41 పోలింగ్ కేంద్రాల ద్వారా మండలములోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఓంకార్ యాదవ్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ధర్మారం : ధర్మారం మండలంలో సోమవారం పార్లమెంట ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో73శాతం పోలింగ్ జరిగింది. మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ లు పరిశీలించారు.

రామగిరి : పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికలు మండలంలోని సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. ఎన్నికల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. మండలంలోని బేగంపేట్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ 30,31,32,33,34 పోలింగ్ బూత్‌లను అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పరిశీలించారు. పోలింగ్ సరళిపై ఎప్పుడికప్పుడు నివేదికను అందించాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని రత్నాపూర్ పోలింగ్ కేంద్రాన్ని ఐఏఎస్ అధికారి రవిగుప్తా పోలింగ్ సరళిని పరిశీలించారు. పన్నూరులోని బూత్‌లను సహయ రిటర్నింగ్ అధికారి హనుమానాయక్, తహసీల్దార్ రాంచందర్‌రావులు పర్యవేక్షించారు. సీఐ రాజమౌళి, ఎస్ఐ సందీప్‌ల ఆధ్వర్యంలో పోలీసులు పేట్రోలింగ్ చేపట్టారు. పోలింగ్ కేంద్రాల్లో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. కాగా, ఉదయం 7 గంటలకు ప్రారంభమై పోలింగ్ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగించారు. మండలంలో 38,974 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 18,992, 19,981 మంది మహిళలు ఇతరులు 01తో ఉన్నారు. పార్లమెంట్‌కు జరిగిన ఎన్నిక పోలింగ్‌లో మండలంలో అనదికారికంగా 70శాతం ఓటింగ్ నమోదైనట్లు తెలిసింది. మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రంలో సాయంత్రం ఓటర్లు బారులు తీరి ఉండడంతో ప్రధాన గేట్‌లను 4గంటలకే మూసివేసినా కేంద్రాల్లోని ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేదుకు గంట అదనంగా సిబ్బంది ఉండాల్సివచ్చింది.


రత్నాపూర్ పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న ఎన్నికల పరిశీలకులు


మంచిర్యాల పట్టణంలో తల్లితో కలిసి ఓటు వేసిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ


క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్


గోదావరిఖనిలో ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఈశ్వర్


మంథనిలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే చందుపట్ల రాంరెడ్డి


పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంలాల్ ప్రసాద్


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్


కొత్తగా ఓటు హక్కు వినియోగించుకున్న యువతులకు పువ్వులు ఇస్తున్న అధికారులు


మంథనిలో క్యూలైన్‌లో నిలబడిన జడ్పీ చైర్మన్ పుట్ట మధు


రంగంపల్లిలో క్యూలైన్‌లో నిలబడిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


సిరా గుర్తును చూపుతున్న ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు లక్ష్మీనారాయణ, బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంథని ఆర్డీవో

అభివృద్ధిపై దృష్టి సారిస్తాం : మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, మే 13: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ రాష్ట్రంలో ముగిసింది.. ఇక ప్రజాసేవ ముందుందని, అభివృద్ధిపై దృష్టి సారిస్తామని, విపక్షాలకు దీటుగా సమాధానం చెప్తామని మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మంథనిలో పలు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళని ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. పోలింగ్ సరళి, ఓటర్ల స్పందన చూస్తుంటే అత్యధిక మెజార్టీతో గడ్డం వంశీకృష్ణ గెలుపు ఖాయంగా కన్పిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా గ్యారెంటీ పథకాల అమలు పైన ప్రధానంగా దృష్టి సారిస్తామన్నారు. ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ చేసి చూపిస్తామన్నారు. ఆరు గ్యారంటీల అమలుపైన విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, ఖచ్చితంగా ఆరు గ్యారెంటీ పథకాలు అమలుచేసి చూపిస్తామన్నారు. ఎలక్షన్ కోడ్ వలన ప్రభుత్వ పథకాలను అమలు చేయలేకపోయామని, ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందిస్తామన్నారు. పారిశ్రామికవేత్త, గడ్డం వెంకటస్వామి మనవడు గడ్డం వంశీకృష్ణ అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపు ఉన్నారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో సైతం ప్రభుత్వము ఏర్పాటు చేస్తున్నట్లు విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలంతా ఓటు వేసి ప్రజాస్వామ్య నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, మంథని ముఖ్య కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూంను సందర్శించిన ఎన్నికల పరిశీలకుడు

పెద్దపల్లిటౌన్, మే 13: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌ను ఎన్నికల సాధారణ పరిశీలకుడు రావీష్ గుప్తా సందర్శించి వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ ప్రక్రియను పరిశీలించారు. పెద్దపల్లి ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా జిల్లా పరిధిలో 497 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, 131 పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు, పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలు ద్వారా కంట్రోల్ రూమ్‌లో మానిటరింగ్ చేస్తున్నామని కంట్రోల్ రూం నోడల్ అధికారి పరిశీలకులకు వివరించారు. జిల్లా పరిధిలో పెద్దపల్లి పార్లమెంటు స్థానానికి పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందని అధికారులు వివరించారు. కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి, ఉపాధి అధికారి వై.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు మరిచిన కాంగ్రెస్..

- జడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని, మే 13: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలును మరచిన కాంగ్రెస్ పార్టీకి ఓటు బుద్ధి చెప్పాలనే ఆలోచనతో ప్రజల్లో కనిపించిందని జడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతులో పుట్ట మధు తన ఓటు హక్కును సోమవారం వినియోగించుకున్నారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీ పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి ఇప్పటి వరకు పథకాలను పక్కన పడేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం మళ్లీ పథకాల ఆశ చూపిన కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్తేనే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తారనే ఉద్దేశ్యంతో ప్రజలు ఓటింగ్‌లో పాల్గొంటున్నట్లు కనిపించిందన్నారు. మంథని నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇప్పటి వరకు చూసింది ట్రయల్ మాత్రమే.. ఇక ముందు 70 ఎంఎం సినిమా చూపిస్తామంటూ మాట్లాడిన తీరును ప్రజలు గమనించాలన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎంగా కేసీఆర్ నాయకత్వంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలు చూశారని, అదే విధంగా కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన ఐదు మాసాల్లో ఎలా పథకాలు కనుమరుగైపోతున్నాయో చూశారన్నారు. కేంద్రంలో ప్రశ్నించే గొంతు ఉండాలంటే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికే అవకాశం ఇవ్వాలని ప్రజలు ఆలోచన చేస్తున్నట్లు ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.